# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 28, ఏప్రిల్ 2026


### విధులపై నిర్లక్ష్యం వహించిన

## పంచాయితీ కార్యదర్శి సస్పెండ్

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం విధులను నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ కె.హరిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని చింతలమానెపల్లి మండలం గంగాపూర్ గ్రామపంచాయతీలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారించగా, గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్ ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సిసి రోడ్ల బిల్లుల చెల్లింపులలో నిర్లక్ష్యం వహించి నిధులను పనిచేసిన వారికి కాకుండా ఇతరులకు చెల్లించడం జరిగిందని నిర్ధారణ అయిందని తెలిపారు. ఈ మేరకు సదరు పంచాయతీ కార్యదర్శి విధుల నుంచి సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారు. గ్రామపంచాయతిలో అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపు, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే పంచాయతీ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఘనంగా ఊరూరా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

**✳ గులాబీ జెండా ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు**



**నస్పూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

నస్పూర్ పట్టణ కేంద్రంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు నస్పూర్ లోని పార్టీ జిల్లా కార్యాలయం, నస్పూర్ కాలనీ చౌరస్తా వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ శ్రేణులు నినాదాలు చేస్తూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పట్టణంలోని పలు విభాగాల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. నాగార్జున కాలనీ 25వ డివిజన్ లో పట్టణ అధ్యక్షుడు అక్కురి సుబ్బన్న పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. టీబీజీకేఎస్ కార్యాలయం వద్ద సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఉద్యమ కాలం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకులు, మిగతా 2లో..



# గన్ని బ్యాగుల కొరత..

## మొక్కజొన్న రైతుల అవస్థలు

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని మొక్కజొన్న రైతుల కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ఈ నెల 22న స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో భోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చేతుల మీదుగా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినప్పటికీ, క్షేత్రస్థాయిలో సమస్యలు తాండవిస్తున్నాయి. కేంద్రం ప్రారంభమై ఐదు రోజులు గడుస్తున్నా, గన్ని బ్యాగుల కొరత కారణంగా కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకవైపు ఎండ తీవ్రత, మరోవైపు అకాల వర్షం పడుతుందేమోనన్న భయంతో రైతులు పంటపై పరదాలు కప్పుకుంటూ కేంద్రం వద్దే పడిగాపులు కాస్తున్నారు. ఈ విషయమై మార్క్‌ఫెడ్ డీఎంను ఫోన్ ద్వారా సంప్రదించగా.. సంచుల సరఫరా ఉందని సమాధానమిచ్చారు. కానీ, గన్ని బ్యాగుల కాంట్రాక్టర్‌ను వివరణ కోరగా.. బాధ్యతారాహిత్యంగా సమాధానం చెబుతూ దురుసుగా ప్రవర్తించారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గన్ని బ్యాగుల కొరతను తీర్చి, మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.



### వాగులో ఈతకు వెళ్లి

## యువకుడు మృతి

**సారంగాపూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**

మండలంలోని వైకుంఠపూర్ గ్రామానికి చెందిన సతెల్లి సాయి ప్రసాద్ (23) వాగులో మునిగి మరణించారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. సాయి ప్రసాద్ తన స్నేహితులతో కలిసి సోమవారం మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో ధోనిగాం వాగులో స్నానం చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలో ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. మృతుడి తండ్రి సాయన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

### ఆదివాసులు సాగుచేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలని

# ఐటిడిఏ కార్యాలయం ఎదుట ధర్నా

**ఉట్నూర్, ఏప్రిల్ 27,ప్రభాతవార్త**

ఆదివాసులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఉట్నూరు మండలంలోని ఐటిడిఏ కార్యాలయం ఎదుట గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సోమవారం ఏపీవోజాదవ్ వసంతరావుకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతావత్ రాందాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వెంకటాద్రిలు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో పర్యావరణ పేరుతో అడవుల సంరక్షణ పేరుతో హరితహారం పేరుతో గిరిజనుల భూములలో మొక్కలు నాటడం కందకాలు తవ్వడం వంటి చర్యలతో పోడు రైతులవారి సాగు భూముల నుండి తరిమి వేయడానికి ప్రయత్నిస్తున్నరు. 1/70 గిరిజన చట్టం కాని 2006 నాటి అడవి హక్కు చట్టం ఏవి అమలుకు నోచుకోవడం లేదు సరి కదా ప్రతి సంవత్సరం పోడు వ్యవసాయం చేసే గిరిజనులపై ఫారెస్ట్ అధికారులు ప్రభుత్వ పోలీస్ బలగాలుల దాడులతోనే వారికి తొలకరి ప్రారంభమవుతున్నది. ప్రతి సంవత్సరం దినదిన గండంగా నడుస్తున్నది. దానితోపాటు ఏజెన్సీ ప్రాంతంలో కొన్నిచోట్ల టైగర్ జోన్ నిర్మించేపేరుతో అడవి దావునఉన్న అనేక గ్రామాల ప్రజలను ప్రభుత్వాలు అనేక ఎత్తుగడులతో మోసగించి మభ్యపెట్టి గ్రామాలను ఖాళీ చేయించి ప్రజలను రోడ్డుపడేసి పెద్ద పులులకు వసతి కల్పించాలని. చూస్తున్నాయి. దానితో పాటు పట్టాదారు పాసు పుస్తకాలు కలిగివున్న కూడా గతంలో రైతుబంధు క్రాప్ లోను వచ్చినా కూడా 30 సంవత్సరాల పైగా సాగుచేస్తున్న భూముల నుండి సైతం గిరిజనులను ఖాళీ చేస్తున్నారు.1/70 గిరిజన చట్టం ప్రకారం కోర్టులో గిరిజనులకు అనుకూలంగా జడ్జిమెంట్ మిగతా 6లో..



# ఘనంగా ఊరూరా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు







బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న యువజన సంఘం అధ్యక్షుడు డి. చంద్రశేఖర్

**(మొదటిపేజీ తరువాయి)**

కార్యకర్తలు ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ కార్యదర్శి మెరుగు పవన్ కుమార్, నాలుగో డివిజన్ కౌన్సిలర్ గుమ్మడి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు వంగ తిరుపతి, పూదరి కుమార్, మాజీ జెడ్పీటీసీ తిప్పని రామన్న, సీనియర్ నాయకులు పి. జనార్దన్, ఆకునూరి సంపత్, రుకుం తిరుమల్, జాడి భానుచందర్, కుర్మిళ మోహన్, వీర్ల తిరుమల్ రావు, బండారి తిరుపతి, పెట్టం నరేష్, గరిసె భీమయ్య, రఫీ ఖాన్, ఎల్లయ్య, స్వామి దాస్, యూత్ నాయకులు దగ్గుల మధుకర్, నోముల నరేందర్ రెడ్డి, కందుల ప్రశాంత్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

### వేమనపల్లి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షులు కోలి వేణుమాధవ్ రావు పిలుపు మేరకు పార్టీ జెండా ఎగురవేశారు. వారు మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి సంక్షేమాన్ని అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు వెలిశాల రమేష్, మండల నాయకులు, మాజీ సర్పంచ్ లు, కార్యకర్తలు ఉన్నారు.

### జన్నారం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని జన్నారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాం రెడ్డి గులాబీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యకర్తలు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధనలో, రాష్ట్ర అభివృద్ధిలో బీఆర్ఎస్ పాత్రను కొనియాడారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, నాయకులు సిటిమల భరత్ కుమార్, దాసరి శ్రీను, చెట్పల్లి సత్యం, ఒళ్లాల నరస గౌడ్, నాసాని రాజన్న, ఐలవేణి రవి, నరసింహులు, శ్రీధర్, దుమల ఎల్లయ్య(రెడ్డి), రాజన్న భూతం శీను మహేష్, లక్ష్మీనారాయణ, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### బజార్‌హత్నూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:

మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ స్థాపించి 25 వసంతాలు పూర్తి చేసుకుని 26వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మండల యువజన సంఘం అధ్యక్షుడు డి. చంద్రశేఖర్ పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలకు, నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని, ప్రస్తుత పరిస్థితిని ప్రజలు గమనించాలని కోరారు. ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని, ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు అందించి ప్రజల గుండెల్లో నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరచ సాయన్న, మాజీ సర్పంచ్ ఫడ్ జ్ఞానేశ్వర్, నాయకులు చట్ల వినీల్, సుభాష్, కొత్త నర్సయ్య, కొంగర్ల రాజన్న, తడక శ్రీనివాస్, చట్ల తరుణ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### సారంగాపూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:

రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు సోమవారం సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండల పార్టీ కన్వీనర్ దేవి శంకర్ మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందని, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన ఘనత ఈ పార్టీకే దక్కుతుందని పేర్కొన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసి, భవిష్యత్తులో మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సిరికొండ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:

సిరికొండ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు ఒరగంటి పెంటన్న పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్షి ్మ పథకం పేరుతో మహిళాలోకాన్ని మోసం చేసిందని ఆయన విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో 2001 నుండి సాగిన పోరాట ఫలితంగానే స్వరాష్ట్రం సిద్ధించిందని గుర్తు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలందరూ ఐక్యమత్యంతో పనిచేసి గ్రామగ్రామాన గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ఎత్తున ధర్నాలు చేపడతామని ఈ సందర్భంగా నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### కోటపల్లి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి, ప్రత్యేక రాష్ట్ర స్వప్నాన్ని సుసాధ్యం చేసిన భారత్ రాష్ట్ర సమితి బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పారుపల్లి గ్రామంలో అంబరాన్నంటాయి. చెన్నూర్ మాజీ శాసన సభ్యులు, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ పిలుపు మేరకు పారుపల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాను ఘనంగా ఎగురవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ ఎగురవేసిన గులాబీ జెండా నేడు తెలంగాణ ప్రగతికి, ఆత్మగౌరవానికి నిదర్శనమని కొనియాడారు. అసాధ్యమని ఎందరో విమర్శించినా, వెరవకుండా పోరాడి స్వరాష్ట్రాన్ని సాధించిన ఘనత కేవలం బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని వారు స్పష్టం చేశారు. బాల్క సుమన్ అన్న నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి పునరంకితమవుతామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. జై తెలంగాణ, జై కేసీఆర్ జై బాల్క సుమన్ అనే నినాదాలతో పారుపల్లి పరిసరాలు మారుమోగాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

### తాండూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :

మండల కేంద్రంలోని ఐబిలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐబీ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బా దత్తు మూర్తి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు కేసీఆర్ చేసిన కృషిని నాయకులు కొనియాడారు. బిఆర్ఎస్ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధించిందన్నారు అధికారంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దత్తాత్రేయ రావు, ఎలుక రామచందర్, బోడ సతీష్, గట్టు సంతోష్ కూమార్, చంద్రశేఖర్, శ్రీరాములు గంగారాం, రాము, శంకర్ కార్యకర్తలు పాల్గొన్నారు.









బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఒరగంటి పెంటన్న




ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

## ఉపాధి హామీ పనుల పరిశీలన

**వేమనపల్లి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

వేమనపల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఓ కుమారస్వామి పరిశీలించారు. ఫారం పండ్ పనులు పరిశీలించి, మాస్టర్ రోల్ కాల్ చేసి కూలీల హాజరు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కూలి పూర్తి పని దినాలను సద్వినియోగం చేసుకోవానీ, వేజ్ రేట్ రూ.307 వచ్చుటకు రోజువారీగా వస్తున్న వేతనాలు చేయవలసిన కొలతల గురించి తెలియజేశారు. అదేవిధంగా పని సమయంలో త్రాగు నీటిని, నీడ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మహేశ్వర్ రెడ్డి, ఎఫ్ఏ లు పాల్గొన్నారు.

## 29న వాహనాల బహిరంగ వేలం

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**




లక్షెట్టిపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో జప్తు చేసిన వాహనాలకు ఈ నెల 29న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఇన్స్పెక్టర్ సమ్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం రోజున ఉదయం 10 గంటలకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మంచిర్యాల సమక్షంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ లక్షెట్టిపేట నందు బహిరంగ వేలం నిర్వహించబడును. కావున ఆసక్తిగల వారు ఈ నెల 29న బహిరంగ వేలంలో తగిన ధరావత్తు సొమ్ము చెల్లించి పాల్గొనవచ్చునని లక్షెట్టిపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ తెలిపారు. వాహనాలకు సంబంధించిన వివరములు ఎక్సైజ్ స్టేషన్ లో తెలుసుకోవచ్చునని తెలిపారు.

### డిగ్రీ అడ్మిషన్ల కోసం

## దోస్త్ హెల్ప్ డెస్క్ ప్రారంభం

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అభ్యర్థులు డిగ్రీలో చేరడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోసం డిగ్రీ ఆన్లైన్ సర్వీసెస్ తెలంగాణ దోస్త్ పేరుతో షెడ్యూల్ విడుదల చేసింది. విద్యార్థుల సౌకర్యం కోసం లక్షెట్టిపేట ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ హెల్ప్ డెస్క్ ని ప్రిన్సిపాల్ డా. మహాత్మా సంతోష్ సోమవారం ప్రారంభించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీ అడ్మిషన్ కోసం ఏమైనా సందేహాలు ఉంటే ఈ హెల్ప్ డెస్క్ ద్వారా నివృత్తి చేసుకోవచ్చని, డిగ్రీలో చేరడానికి అన్ని రకాల సమాచారాన్ని దోస్త్ హెల్ప్ డెస్క్ ద్వారా పొందవచ్చని తెలిపారు. విద్యార్థులు హెల్ప్ డెస్క్ ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేరుగా సంప్రదించ వచ్చని లేదా ఇంటి నుంచి హెల్ప్ డెస్క్ ఇంచార్జీ శ్రీనివాస్‌ని 8008948148 ఫోన్ నంబర్‌ను సంప్రదించి తగిన సమాచారం పొందవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడి నుండైనా డిగ్రీ అడ్మిషన్ పొందడానికి ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవచ్చని తెలిపారు. దోస్త్ ద్వారా అడ్మిషన్ లలో పారదర్శకత లభిస్తుందని తెలిపారు. దోస్త్ రిజిస్ట్రేషన్ లేకపోతే డిగ్రీ అడ్మిషన్ కు అర్హులు కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శంకరయ్య, శ్రీనివాస్, సంధ్యారాణి, కవిత, స్వప్న, మహేష్, సతీష్ బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



దోస్త్ హెల్ప్ డెస్క్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

# ఎరువుల కంపెనీల ఆంక్షలు మానుకోవాలి

**తాండూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :**

ఎరువుల కంపెనీలు ఆంక్షలు విధించడం మానుకోవాలని సీడ్స్, ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ సంఘం తాండూర్ మండల అధ్యక్షుడు బోనగిరి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బాలు ప్రసాద్ మారు డిమాండ్ చేశారు. తాండూర్ ప్రెస్ క్లబ్ లో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కంపెనీల యాజమాన్యాల తీరుతో రైతులు, షాపుల డీలర్లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎరువుల కంపెనీల యాజమాన్యాల తీరుకు నిరసనగా ఆల్ ఇండియా ఫర్టిలైజర్స్ అసోసియేషన్, స్టేట్ ఫర్టిలైజర్స్ అసోసియేషన్, మంచిర్యాల జిల్లా ఫర్టిలైజర్ అసోసియేషన్ ఆదేశాల మేరకు సోమవారం దేశ వ్యాప్తంగా నిర్వహించిన బంద్ లో భాగంగా డీలర్లు రైతుల సమస్యల పరిష్కారం కోసం తాండూర్ మండల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు దుకాణా లు స్వచ్ఛందంగా మూసివేసినట్లు తెలిపారు. ఎరువుల ధరలు రోజు రోజుకూ భారమవు తున్నాయని, మరో వైపు కంపెనీలు వివిధ ఉత్పత్తులను లింక్ రూపంలో ఇవ్వడం ద్వారా రైతులకు అదనపు భారం పడుతుందన్నదన్నారు. రవాణా చార్జీలు ఎక్కువగా ఉన్నందున ఆ భారం డీలర్లపైన పడి నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఫర్టిలైజర్ లో ఎఫ్ ఓ ఎల్ క్రింద మాకు (యూరియా, డిఏపి, కాంప్లెక్స్, ఫొటాస్) లింకు ప్రోడక్ట్లు ఇవ్వకుండా ఎరువులు సరాపర చేయాలని, విత్తనాలు ఎరువుల శాంపిల్స్ ఫెయిల్ అయినట్లయితే కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే రైతులకు భారం కాకుండా కావాల్సిన ఎరువులను మాత్రమే ఇచ్చేలా చూడాలని, ఎరువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘంకోశాధికారి దత్తుమూర్తి,యజమానులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సంఘం నాయకులు



వినతులు స్వీకరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాయక్వాడి జల కుమారి

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**నిర్మల్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**

ప్రజావాణిలో అందిన దరఖాస్తులను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజిషన్) నాయక్వాడి జల కుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె జెడ్పీ సీఈవో భాగ్యలక్ష్మితో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు మరియు భూ సమస్యలకు సంబంధించి పలు దరఖాస్తులను సమర్పించారు. బాధితుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఆమె, సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## భారీగా బిఆర్ఎస్‌లో చేరిక

**వాంకిడి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :**

వాంకిడి మండలంలోని బంబారా గ్రామంలోని వార్డు సభ్యులుకొట్నాక రాంశావ్,లోబడే ఉమేష్,డోకే బండు,సోయం చందన్ షావ్,కుర్ర చంద్రశేఖర్,కర్పెత మెహపత్ రావు లు ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవా లక్ష్మి ఆదేశాల మేరకు, బంబారా మాజీ సర్పంచ్ అయ్యూబ్ సహకారంతో మండల పార్టీ అధ్యక్షుడు పారుపల్లి అజేయ్ కుమార్ ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ పార్టీ లో చేరడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బి ఆర్ ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని వార్డు సభ్యులు నేతలు బిఆర్ఎస్ పార్టీ వైపు ఆకర్షణీయతులైతున్నారన్ని అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ సింగిల్ విండో ఛైర్మెన్ జాబిరే పెంటూ, వైస్ ఛైర్మన్ నేపాజి, మాజీ ఎంపీపీ రాజ్ కుమార్,యువనాయకులు వార్డు సభ్యుడు శైలేష్,తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ బుర్రా పోచయ్య క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సోమవారం రాజంపేట గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు పరిశీలించారు.ప్రస్తుత వేసవి కాలం దృష్ట్యా ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున కూలీలు, సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ సూచించారు. ఎండ దెబ్బ తగలకుండా పనుల సమయాల్లో మార్పులు చేసుకోవాలని, పని ప్రదేశంలో నీడ, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. గత రెండు నెలలుగా గ్రామంలో ఉపాధి హామీ కింద రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ, భూసంరక్షణ వంటి పనులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ పోచయ్య

## జనాభా గణన శిక్షణ ప్రారంభం

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**

బజార్‌హత్నూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో జనాభా గణన శిక్షణ శిబిరాన్ని తహశీల్దార్ కె.శ్యామ్ సుందర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా గణన ప్రక్రియపై మూడు రోజుల పాటు విడతల వారీగా శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ హిరాలాల్, రెవెన్యూ సిబ్బంది నూర్ సింగ్, మహేందర్, మాస్టర్ ట్రైనర్ ఎస్.చందన్ బాబుతో పాటు 32 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్ శ్యామ్ సుందర్

# రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించాలి

## మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ - సీతారాంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నస్పూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ సూచించారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్ సీతారాంపల్లి రైతు వేదిక వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వేసవి కాలంలో పండించిన ధాన్యాన్ని చుట్టుపక్కల గ్రామాల రైతులు ఈ కేంద్రానికి తీసుకురావాలని ఆయన కోరారు. ధాన్యం విక్రయించిన వారం పది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తుందని మేయర్ వెల్లడించారు. సన్న వడ్లు పండించిన రైతాంగానికి ప్రభుత్వం ప్రకటించిన 500 రూపాయల బోనస్ కూడా అందుతుందని స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియలో ఏవైనా లోటుపాట్లు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటిని సత్వరమే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతు ధర పొందాలని హితవు పలికారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన కనీస సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సురిమిల్ల సౌమ్య, సింగిల్ విండో డైరెక్టర్లు మల్లేష్, లింగన్న, ఐకేపీ సెంటర్ ఇంచార్జి వర్ష, ఏఈఓ సంధ్య, మెప్మా టీఎంసీ నాగరాజు, స్థానిక నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సీతారాంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ మధుకర్

## తెల్లజొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**సారంగాపూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలో తెల్లజొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు అట్ల పోతారెడ్డి తెలిపారు. ప్రభుత్వం తెల్లజొన్నలకు క్వింటాల్‌కు రూ. 3,699 మద్దతు ధర ప్రకటించిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల పరిధిలోని సారంగాపూర్ మార్కెట్ యార్డ్, స్వర్ణ సెంటర్‌లలో ఈ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఈ కేంద్రాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జ్ కూచాడి శ్రీహరి రావుల సహకారంతో జిల్లాలోని పంట వివరాలను ప్రభుత్వానికి అందజేసి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కృషి చేసినట్లు తెలిపారు. రైతులు దళారుల బారిన పడి నష్టపోకుండా, సరైన మద్దతు ధర పొందడానికి ఈ కేంద్రాలు దోహదపడతాయన్నారు. గతంలో తక్కువ ధరకు పంటను అమ్ముకొని నష్టపోయిన పరిస్థితులను గమనించి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అట్ల పోతారెడ్డి చెప్పారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ క్రమంలో కృషి చేసిన ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# దేగామలో నూతనంగా వారసంత ఏర్పాటు

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**

మండలంలోని దేగామ గ్రామంలో నూతనంగా వారసంతను ఏర్పాటు చేయనున్నట్లు గ్రామ సర్పంచ్ దుర్వ దేవుబాయి లక్ష్మణ్ తెలిపారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రతి మంగళవారం వారసంత నిర్వహించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సంతలో కూరగాయలు, పండ్లు, నిత్యావసర సరుకుల విక్రయాలు జరుగుతాయని వివరించారు. కూరగాయల రైతులు, చిరు వ్యాపారులు ఈ అవకాశాన్ని గమనించి వారసంతను విజయవంతం చేయాలని కోరారు. వ్యాపారస్తులకు, కొనుగోలుదారులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను గ్రామ పంచాయతీ తరపున కల్పిస్తామని వారు హామీ ఇచ్చారు.

# ఎస్సై విక్రమ్‌ను సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

**సిరికొండ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**

సిరికొండ మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన విక్రమ్‌ను సోమవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసులు ముందుండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పిట్ల విజయకుమార్, సూర్యకాంత్, పెందురు లక్ష్మణ్, మాజీ ఎంపీపీ పెందూర్ అమృతరావ్, మాజీ సర్పంచ్ ఒరగంటి పెంటన్న, సిరికొండ మాజీ ఉపసర్పంచ్ తోకల చందు, ఇతర ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్సై విక్రమ్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## విద్యార్థులకు పోలీసుల వేసవి కానుకగా ఉచిత క్రీడా శిక్షణ

**సిరికొండ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**

విద్యార్థులలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు జిల్లా పోలీస్ శాఖ పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసింది. మే 4 నుండి మే 30 వరకు ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆదిలాబాద్‌తో పాటు ఉట్నూర్, నార్నూర్, ఇచ్చోడా, బోథ్, ఇంద్రవెల్లి కేంద్రాల్లో ప్రతిరోజూ ఉదయం 6 నుండి 7 గంటల వరకు శిక్షణ కొనసాగుతుంది. రెండవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు దీనికి అర్హులు. వాలీబాల్, కరాటే, యోగా, కబడ్డీ, ఆర్చరీ వంటి క్రీడల్లో నిపుణులైన శిక్షకుల ద్వారా ఉచితంగా శిక్షణ ఇస్తారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి ఇదొక మంచి అవకాశమని ఎస్పీ పేర్కొన్నారు. ఆసక్తి గల సిరికొండ విద్యార్థులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఎస్సై విక్రమ్ సూచించారు.

## టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన ఆడే గజేందర్

**నేరడిగొండ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**



హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై వారు సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను గజేందర్ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా ఈ భేటీలో ప్రస్తావించారు.

## నీట్ ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :**

మే 3 న నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ హరిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ ద్వారా నిర్వహించే వైద్య విద్యను అభ్యాసించే విద్యార్థులకు జాతీయ అర్హత ప్రవేశ పరిక్ష నిర్వాహణకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో పరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా నుండి 316 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరౌతారని తెలిపారు. పరిక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని, పరిక్షలకు హాజరయ్యే విద్యార్థులు నిర్ణిత సమయానికి ముందే పరిక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరిక్ష కేంద్రంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు.

## సారంగాపూర్ మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ప్రారంభం

**సారంగాపూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి, ప్యారామూర్, యాకర్ పల్లి, స్వర్ణ గ్రామాలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూచాడి శ్రీహరిరావు కృషితో మండలంలోని ఈ నాలుగు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. రైతులు తమ పంటను దళారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపోకుండా, ప్రభుత్వం కల్పించిన ఈ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కేంద్రాల ఏర్పాటుకు సహకరించిన నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మక్సూర్ వరలక్ష్మి, ఉపసర్పంచ్ రామ్ రెడ్డి, నాయకులు మిర్ద సాయన్న, వంగ భూమారెడ్డి, లింగారెడ్డి, ముత్యంరెడ్డి, మధుకర్, రవీందర్ రెడ్డి, ఆనంద రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మాద గంగారెడ్డి, సుదర్శన్, రైతులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలలో డిపిఓ పర్యటన

**తాండూర్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త**

మండలంలోని చౌటపల్లి, రేచిని గ్రామ పంచాయతీలలో సోమవారం మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి (డిపిఒ) వెంకటేశ్వరరావు పర్యటించారు. చౌటపల్లి గ్రామ పంచాయతీలో పీఎం ఏజెఏవై పథకానికి సంబంధించిన పనుల వివరాలను డిపిఒ అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టు ప్రయోజనాలు అందరికీ అందే విధంగా చూడాలని ప్రజా ప్రతినిధులకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పారిశుద్ధ్య పనులు పరిశీలించి ప్రతి మురికి నీటి కాలువ చివరలో ఇంకుడు గుంతలు నిర్మించాలని ఆదేశించారు. రేచిని గ్రామ పంచాయతీలో మురికి కాలువలు, వాటర్ పంపులు, ఇందిరమ్మ ఇళ్లు, నర్సరీ, వైకుంఠ ధామం, సెగ్రిగేషన్ షెడ్‌లను పరిశీలించారు. గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేసి ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అనిల్ కుమార్, సర్పంచులు ముదాం సునీత, పోతురాజుల రాంబాయి, పంచాయతీ కార్యదర్శులు వసంత, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



చౌటపల్లి కార్యదర్శిని అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న డిపిఓ వెంకటేశ్వరరావు


# రైతులు పంట మార్పిడి విధానం పాటించాలి

**తాండూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :**



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్

రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి విధానం పాటించాలని శాస్త్రవేత్తలు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ప్రైన్ అన్నారు. మండలంలోని నర్సాపూర్ గ్రామంలో సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం, బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ యూరియా వాడకం తగించడం వల్ల నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. సాగు నీటిని ఆదా చేయడం, పంట మార్పిడి చేయడం వలన చీడపీడలను తగ్గించచవచ్చన్నారు. మన ప్రాంతంలో పత్తి, జొన్న, మొక్కజొన్న సాగుకు అనుకూలమని, రైతులు పత్తి తర్వాత ఇతర పప్పు దినుసుల పంటలైన పెసర, మినుములు, కూరగాయల పంటలు సాగు చేయాలన్నారు. చెట్లను పెంచడం వలన పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవచ్చని వివరించారు, రసాయనాలను అవసరాన్ని బట్టి వాడటంతో పాటు రశీదులను భద్రంగా ఉంచుకోవాలన్నారు. వరిలో సన్న గింజ రకాలు వాటి లక్షణాలు పాటించాల్సిన పద్ధతులను వివరించారు. అంతేకాకుండా సంప్రదాయ పంటలు, వాణిజ్య పంటలు సాగు చేసి రైతులు ఆర్థికంగా వృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాత్‌రావు, వ్యవసాయ సహాయ సంచాలకులురాజనరేందర్, వెంకటేష్ పంచాయతీ సెక్రటరీ జగదీష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## పిల్లలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి

### - మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్

**నస్పూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

పిల్లలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆఫ్టర్ కేర్ కార్యక్రమానికి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బాలల భద్రత, రక్షణ వారాన్ని మే 2వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా మొదటి రోజు పైన సోమవారం రోజు చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్ లో ఉన్న పిల్లలకు అవసరమైన ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ, బ్యాంక్ ఖాతా, జనన ధ్రువీకరణ, ఇతర పత్రాలు అందించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని పిల్లలు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపికకు 30న మండల స్థాయి ఇంటర్వ్యూలు

**జన్నారం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**



ఎస్సీ కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్ 2025-26 కింద అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం మండల స్థాయి ఇంటర్వ్యూలను ఈనెల 30న నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఉమర్ షరీఫ్ సోమవారం రోజున ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేది గురువారం ఉదయం 11.00 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం, జన్నారంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఈ ఇంటర్వ్యూకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, మండల స్థాయి కమిటీ సభ్యులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

## గోమాతను జాతీయ జంతువులుగా ప్రకటించాలి

**ఉట్నూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :**

గోమాతను రక్షించాలని రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రిలకు వినతిపత్రం సమర్పిస్తూ వాటిని వారికి అందజేయాలని తహసిల్దార్ కార్యాలయం రెవెన్యూ అధికారులకు నాలుగు సెట్ల వినతిపత్రంను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గో సేవా సమితి ప్రతినిధులు ఠాకూర్ గోపాల్ సింగ్, గుగ్లావత్ శ్రీరామ్ నాయక్, మంథని శ్యాంసుందర్, గట్ల సతీష్, కొండేరి రమేష్, వెంకటేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు



రెవెన్యూ అధికారులను వినతిపత్రంను అందజేస్తున్న గో సేవా సమితి సభ్యులు

## ఇండ్ల గణనను సమర్థవంతంగా నిర్వహించాలి: తహసీల్దార్ తిరుపతి

**పెంచికల్‌పేట్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :**

మండలంలో కొనసాగుతున్న ఇండ్ల జాబితా, గణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గణన దేశ అభివృద్ధికి కీలకమని శిక్షణలో పాల్గొన్న సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లకు తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి కచ్చితమైన వివరాలు నమోదు చేయాలని, శిక్షణలో సూచించిన మార్గదర్శకాలను పాటించాలని పేర్కొన్నారు. హెచ్‌ఎల్వో యాప్ వినియోగంలో నైపుణ్యం పెంపోందించుకోవాలని, ఫీల్డ్ లో ఎదురయ్యే సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సహకారం పొందాలని సేకరించిన సమాచారం గోప్యత కాపాడాలని తెలిపారు. సమయపాలన, క్రమశిక్షణతో పనిచేస్తే కార్యక్రమం విజయవంతమవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ట్రైనర్లు ఖమర్, రాజ్ కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ తిరుపతి

## మే 4 నుంచి విద్యార్థులకు ఉచిత సమ్మర్ క్యాంప్

**నార్నూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**

నార్నూర్ మండల కేంద్రంలో మే 4 నుండి విద్యార్థుల కోసం సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎస్సై శ్రీ సాయి తెలిపారు. సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు "పోలీసులు మీకోసం" కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో అనుభవజ్ఞులైన శిక్షకుల ద్వారా ఉచితంగా శిక్షణ ఇస్తారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. క్యాంపులో పాల్గొనదలచిన వారు మరిన్ని వివరాల కోసం 8712659942, 8712659961 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ శిక్షణ విద్యార్థుల శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.



నూతన తహశీల్దార్ విజయ్ కాంత్ రావును శాలువాతో సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## తహశీల్దార్ విజయ్‌కాంత్‌రావును సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

**సారంగాపూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండల నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయ్ కాంత్ రావును సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండల సమస్యల పరిష్కారంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ దేవి శంకర్, నాయకులు లక్ష్మినారాయణ గౌడ్, శ్యాం రెడ్డి, లక్ష్మణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నేరడిగొండ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో పత్తి జిన్నింగ్ మిల్లు వద్ద మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సెంటర్ ఇంచార్జి గోలి స్వామి మాట్లాడుతూ.. రైతులు తమ మొక్కజొన్న పంటను షెడ్యూల్ ప్రకారం కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో రైతుల ధర్నా

**దండేపల్లి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

మండలంలోని ముత్యంపేట గ్రామంలో జాతీయ రోడ్ పై రైతులతో కలిసి బీజేపీ నాయకులు సోమవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ముత్తే అనిల్ వర్మ మాట్లాడుతూ, దాదాపు వడ్ల కుప్పలు నెల రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్క బస్తా కూడా తూకం చేయలేదని అన్నారు. రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి, మొక్కజొన్నను వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో దండేపల్లి ఎస్సై తహసీనుద్దీన్ చేరుకొని ఎమ్మార్వోతో మాట్లాడించి రేపటి నుంచి కొనుగోలు మొదలు పెడతామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పత్తిపాక సంతోష్, మాజీ మండల అధ్యక్షుడు బోడకుంటి వెంకటేష్, పేస్ చైర్మన్ బెడద సురేష్, నాయకులు వెంకటేష్, గిరిధర్, కిషన్, మొండయ్య, బుచ్చన్న, వల్లంబట్ల శ్రీనివాస్, ప్రసాద్, శ్రీనివాస్, హరీష్, స్వస్తిక్, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



# ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :**

ప్రజా సంక్షేమం బిఆర్ఎస్ తోనే సాధ్యమని ఆ పార్టీ మండలాధ్యక్షుడు జాబరి రవీందర్ అన్నారు. బిఆర్ఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఎమ్మెల్యే కోవ లక్ష్మీ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్, యువ నాయకుడు కోవ సాయినాథ్, మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్ , నాయకులతో కలిసి జెండా ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత కేసిఆర్ కు దక్కిందని, ప్రస్తుత ప్రభుత్వం ప్రజలను మోసం చేయడం తప్ప సంక్షేమం ఊసే లేదని ఆరోపించారు. గత రెండున్నర దశాబ్దాలుగా పార్టీ సాధించిన విజయాలను, తెలంగాణ రాష్ట్ర సాధన, రాష్ట్ర పునర్నిర్మాణంలో బిఆర్ఎస్ పోషించిన కీలక పాత్రను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రాష్ట్ర నాయకురాలు మర్సకోల సరస్వతి, మాజీ సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, కౌన్సిలర్లు చిలువేరు వెంకన్న, కుర్సెంగ బాలకృష్ణ, రాజం పేట సర్పంచ్ బుర్స పోచయ్య, ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, నాయకులు నిస్సార్, అన్సర్, జీవన్, సాయి శ్రవణ్, నారాయణ, బలరాం నాయక్, అశోక్, ప్రేమ్ కుమార్, ఆశన్న, గిరి, రవి తదితరులు పాల్గొన్నారు.

**చింతలమనేపల్లీ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త;**

మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,పార్టీ శ్రేణులు ఈ రోజు ఉదయం బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేసి ఘనంగా వేడుకను జరుపుకున్నారు. పార్టీ వ్యవస్థాపకుడు కెసిఆర్ గారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, నజీమ్ హుసేన్,శేఖర్,భాస్కర్,నిలగౌడ్,పాపయ్య,ప్రవీన్. రౌతు దేవాజీ కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

**ఉట్నూర్, ఏప్రిల్ 27,ప్రభాత వార్త :**

పట్టణంలోని ఐబి చౌరస్తా వద్ద బిఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ బిఆర్ఎస్ పార్టీ మండల ఇన్చార్జి అధ్యక్షులు పంద్రజైవంతరావు ఆధ్వర్యంలో నాయకులు బిఆర్ఎస్ పార్టీ జెండా ను ఆవిష్కరించారు. అనంతరం జై కేసీఆర్ జై తెలంగాణ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు న్యాయవాది పెందూర్ ప్రభాకర్, కాటం రమేష్, కామెరి రాజు, రవి నాయక్, భూమన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**లింగాపూర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :**

లింగాపూర్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా బిఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను పార్టీ శ్రేణులు కలసి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ స్థానిక సర్పంచ్ జదవ్ రాజశేఖర్ మాట్లాడుతూ, బిఆర్ఎస్ ఆత్మగౌరవ ప్రతీక ప్రజా ఉద్యమ పతాక ఆరు దశాబ్దాల అన్యాయం అణచి వేయబడిన ఆకాంక్షల మధ్య 2001 లో జల దృశ్యంలో పురుడు పోసుకున్న గులాబీ జెండా.పాతికేండ్ల ప్రస్థానంలో అనేక ఒడిదుడుకులను తట్టుకొని నిలబడింది. పోరాటంలో నైనా పాలనలోనైనా తన పటిమను చూపించింది ఆగదాలు అడ్డంకులు ఎన్ని ఎదురైనా గులాబి పతకం తలవంచలేదు ఎత్తిన పిలికిడి సడల నివ్వలేదు. అందుకే గులాబీ జెండా ప్రజలకు గుండె ధైర్యం తెలంగాణకు ఓ భరోసా 25 వసంతాల బిఆర్ఎస్ పార్టీ నేడు 26వ వసంతంలోకి అడుగుపెడుతున్నది, అని కార్యకర్తలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు జాదవ్ రాజశేఖర్, బానోత్ కిసాన్, మర్సకోల ఉగాది రావు, మాజి జడ్పిటిసి ఆడే లక్షణాయాక్, మాజీ ఎంపీపీ జాదవ్ గౌరీబాయి గణపత్ నాయక్ ,బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు పవర్ గబ్బుసేట్, జాటోత్ రాహుల్ ,బోడా బాపురావు,జదవ్ రమేష్, ఆడే అనిల్ ,తదితరులు పాల్గొన్నారు.

**పెంచికల్‌పేట్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :**

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో సోమవారం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను మండల అధ్యక్షుడు బిట్టి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ స్వరాష్ట సాధన కోసం ఏర్పడిన బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ నాయకత్వంలో మహోజ్వలమైన ఉద్యమాన్ని ముందుకు నడిపి రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిందన్నారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పార్టీ ఎప్పటికప్పుడు కృషి చేస్తోందని తెలిపారు. గత 10 సంవత్సరాల పాలనలో అన్ని వర్గాల సంక్షేమాన్ని ధ్యేయంగా తీసుకుని తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టిందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్, నాయకత్వంలో గులాబీ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చెడ్వాయి గ్రామంలో సర్పంచ్ చౌదరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షులు చౌదరి తిరుపతి, సర్పంచులు వెంకటేష్, మాజీ సర్పంచులు జాజిమోగ్గ శ్రీనివాస్, ఉపాసి సంజీవ్, పాలే సుధాకర్, సత్యనారాయణ, నాయకులు కమలాకర్, సదశివ్, గోపాల్, సిద్దు, ఆనంద్ రావు, నరేష్, షరీఫ్, నాన్నయ్య చౌదరి బండన్న బాబా నరేష్, తదితరులు పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు శ్రీనివాస్



పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ



జెండాను ఆవిష్కరణ చేస్తున్న నాయకులు



గులాబి జెండా ఆవిష్కరించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు

## ఆదివాసులు సాగుచేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలని ఐటిడిఏ కార్యాలయం ఎదుట ధర్నా

**(మొదటిపేజీ తరువాయి)**

అయిన భూముల విషయంలో పంచ నామాలు చేసిఆభూములను గిరిజనులకు అప్పచెప్పవలసిన రెవెన్యూ శాఖ వారు సంవత్సరాల తరబడి ఏ చర్యలు తీసుకోవడం లేదు. వారితో పాటు కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని గిరిజనులకు త్రీఫేస్ విద్యుత్ ఇందిరమ్మ ఇల్లు రోడ్డు సౌకర్యం కల్పించాలనివారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు కుటికెల శంకర్ ఉపాధ్యక్షులు సిడం ధర్మం . మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ధారంగుల ఎల్లయ్య ఉపాధ్యక్షులు ఎనుముల నరసయ్య. మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సంధ్యారాణి. జిల్లా నాయకులు బోడా కిషన్ . రాజమోళి. మల్లేష్ గౌడ్. ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ డిఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వాగ్మారీ సంబాజీ. గణేష్. అదిలాబాద్ జిల్లా అధ్యక్షులు సోయం జుగాధిరావు. జగిత్యాల జిల్లా అధ్యక్షులు గోపి చంద్రయ్య. మామిడి నాగరాజు. దుర్గం మల్లేష్. దుర్గం మున్నయ్య. దర్శనాల మల్లేష్. బాలసాని మల్లేష్ గౌడ్. వేడ్మా నాగరావు కుడ్మేత భగవంతరావు. గుడి కందుల రవి. సీట్ల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లపల్లిలో బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

**నిర్మల్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**





నిర్మల్ గ్రామీణ మండలం ఎల్లపల్లి గ్రామంలో సోమవారం జరగాల్సిన ఒక బాల్య వివాహాన్ని అధికారులు సమయానికి చేరుకుని అడ్డుకున్నారు. గ్రామంలో బాల్య వివాహం జరుగుతుందన్న సమాచారంతో స్పందించిన అధికారులు, పెళ్లి నిలిపివేసి ఇరు కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. బాల్య వివాహ నిరోధక చట్టం ప్రకారం 18 ఏళ్ల లోపు బాలికలకు, 21 ఏళ్ల లోపు బాలురకు వివాహం చేయడం నేరమని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్న వయసులో పెళ్లి చేయడం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, అనర్థాలను వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1098 నంబర్‌కు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారిణి దేవి, మురళి, సూపర్వైజర్ మంగళ, సమన్వయకర్తలు నల్ల గంగాధర్, సుప్రియ, శ్రీదేవి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం ఈసీగా కుమారస్వామి బాధ్యతలు స్వీకరణ

**తాండూర్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :**

మండలంలోని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఈసీగా ఐ.కుమారస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామీణ అభివృద్ధి సంస్థ జిల్లా కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్ గా విధులు నిర్వహిన్న ఆయన డిప్యుటేషన్ పై తాండూర్ మండల ఈసీగా బాధ్యతలు స్వీకరించారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**ఆసిఫాబాద్, ప్రభాతవార్త :**



ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో అర్జిదారుల నుండి ధరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమములో వచ్చిన ప్రతి ధరఖాస్తును క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అన్నారు. అనంతరం అర్జిదారుల నుండి ధరఖాస్తులను స్వీకరించారు. పించన్లు, ఇందిరమ్మ ఇళ్ళు, భూమి సమస్యలు, రైతు బందు మంజురి, సదరం సర్టిఫికేట్లు ఇప్పించాలని పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమములో అధికారులు, అర్జిదారులు పాల్గొన్నారు.